క్లుప్తంగా

భెల్ టౌన్ షిప్‌లో రోడ్డు పరిశీలన



టౌన్ షిప్‌లో రోడ్డును పరిశీలిస్తున్న భెల్ ఈడీ సుబ్రహ్మణ్యం

అక్కిరెడ్డిపాలెం: రాళ్లు తేలి, గోతులమయంగా ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించాలని భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ (యునైటెడ్ ఫ్రంట్) నాయకులు సంస్థ ఈడీ జి.సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకువెళ్లారు. తుంగ్లాంలోని చెరువు వైపు గేటు నుంచి సుమారు 200 మీటర్ల మేర రోడ్డు రాళ్లు తేలిందని, భెల్ గ్రౌండ్ నుంచి సంస్థలోని ఎస్‌బీఐ వరకు అర కిలోమీటరు మేర గోతులు తేలి ఉన్నాయని ఈడీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఈడీ ఆదివారం గుర్తింపు యూనియన్ నాయకులతో కలిసి రోడ్డును పరిశీలించారు. త్వరలో రోడ్డును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తింపు యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

అమృతరావుకు ఘన నివాళి



అమృతరావుకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం ప్రాణ త్యాగం చేయడానికి సిద్ధపడిన తమనంపల్లి అమృతరావుకు స్టీల్‌ప్లాంట్‌లో ఘన నివాళులర్పించారు. అమృతరావు 36వ వర్ధంతి సందర్భంగా ఆదివారం వై.మస్తానప్ప మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు అమృతరావు విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ట్రస్ట్ చైర్మన్ వై. వరలక్ష్మి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగేలా చేయడమే అమృతరావుకు ఇచ్చే నివాళి అన్నారు. కార్యక్రమంలో గొందేశి అప్పలరెడ్డి, డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, రామ్మోహన్‌కుమార్, బి.ఎన్. రాజు, డి.వి. రమణారెడ్డి, పరంధామయ్య, బిసాయ్, చంద్రశేఖర్, పల్లా పెంటారావు, జెర్రిపోతుల మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాకాహార సద్భావన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న శాకాహారులు

పెదగంట్యాడ: శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ కార్యదర్శి మీసాల శివగణేశ్వరరావు అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని శాకాహార సద్భావన ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాకాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. శ్రీ పరమాత్మ పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుడు అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో సి.జగదీశ్వరి, బాలాజీ, భాగ్య గౌరీ, అప్పలరాజు, సుబుది, కనకారావు, నాయుడు, విష్ణుకుమార్, నందిని, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి గ్రంథాలయ మాసోత్సవాలు

అక్కిరెడ్డిపాలెం: మే 19 నుంచి 25వ వరకు 69వ వార్డు షీలానగర్ లేడీస్ వెల్ఫేర్ అసోసియేషన్ శాఖ గ్రంథాలయంలో మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయ కార్యదర్శి పూసపాటి వాణీజానకి రామరాజు ఆదివారం తెలిపారు. 18 ఏళ్లలోపు బాలబాలికలకు వారి తల్లిదండ్రుల ఓటరు గుర్తింపు కార్డు ద్వారా గ్రంథాలయ సభ్యత్వం అందజేస్తామన్నారు. ఉదయం 8 నుంచి 10 వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు గ్రంథాలయ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు షీలానగర్‌లోని గ్రంథాలయ కార్యదర్శి పూసపాటి వాణీజానకి రామరాజును సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నక్షత్ర సహిత నవగ్రహ హోమం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిశక్తి దేవాలయంలో ఆదివారం నక్షత్ర సహిత నవగ్రహ పాశుపతి, ద్వాదశ రాశి సర్పారిష్ట శాంతి హోమం ఘనంగా నిర్వహించారు. చైత్ర బహుళ అమావాస్య సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో రుత్వికులు విశేష పూజలు చేశారు. షోడశోపచార పూజల అనంతరం హోమగుండం వద్ద గణపతిపూజ, వాస్తుపూజ, అగ్ని ప్రతిష్ఠ చేసి హోమ క్రతువును నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు?

అసంపూర్తి పనులు పూర్తి చేయడానికి ఇంకెన్నాళ్లు పడుతుంది..తుది దశలో నిలిచిపోయిన పనులు పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వానికి ఏడాది సరిపోలేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు విస్తరించినా కల్వర్టులు పూర్తి చేయకపోవడంతో అవస్థలు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎన్నాళ్లు అవస్థలు పడాలని నిలదీస్తున్నారు. కూటమి పాలకులు, అధికారులు స్పందించి త్వరితగతిన కల్వర్టులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- అగనంపూడి



కొత్తూరు కాలనీ వద్ద సాగుతున్న కల్వర్టు నిర్మాణ పనులు

- అసంపూర్తిగా కల్వర్టులు
- గత ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణం
- కల్వర్టుల నిర్మాణ సమయానికి ఎన్నికలు
- అప్పటి నుంచి నిలిచిపోయిన పనులు
- పట్టించుకోని కూటమి నాయకులు

రెండేళ్ల కిందట ఆరున్నర కోట్ల జీవీఎంసీ నిధులతో 88వ వార్డు దువ్వాడ సెక్టార్-1 కాలనీ నుంచి అజనగిరి వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ఆరు మాసాల్లో విస్తరణ పనులు చేపట్టి రహదారులు నిర్మించారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 8 మాసాల పాటు వీటి జోలికి వెళ్లలేదు. ఇప్పుడు పనులు ప్రారంభించినా నత్తనడకన సాగుతున్నాయి.

ఉత్తర కుమార ప్రగల్భాలేనా...

ఉగాది నాటికి రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం ఉత్తరకుమార ప్రగల్భాలు పలికింది. ఆ బీరాలు ఉత్తిత్తివే అని తేలిపోయింది. సగంలో ఉన్న పనులు పూర్తి చేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. మూడు మాసాల కిందట పనులు ప్రారంభించి సాగదీస్తూ వస్తున్నారు. నాలుగు చోట్ల కల్వర్టులు ఒక వైపు మాత్రమే నిర్మించారు. రెండు వైపులా రహదారి పనులు పూర్తి కాలేదు.

ట్రాఫిక్ జామ్

ఉదయం, సాయంత్రం వేళల్లో కల్వర్టుల వద్ద వాహనాలు నిలిచిపోతున్నాయి. కొన్ని సమయాల్లో ట్రాఫిక్‌లో చిక్కుకుని సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక పోతున్నామని ప్రజలు వాపోతున్నారు. వెదుళ్లనరవ బీసీకాలనీ, వెదుళ్లనరవ, కొత్తూరుతో కలిపి ఐదు చోట్ల కల్వర్టు పనులు పూర్తి చేయాల్సి ఉంది.





వెదుళ్లనరవ ఆరంభం, చివర్లో నత్తనడకన సాగుతున్న కల్వర్టు నిర్మాణ పనులు

కల్వర్టులు పూర్తి చేయాలి



నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలకు వీలుగా రహదారి విస్తరించారు. కల్వర్టుల వద్ద అసంపూర్తిగా పనులు వదిలేయడంతో ఏడాదిన్నర నుంచి వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. కేవలం కల్వర్టులు నిర్మించడానికి ఇంత సమయం పట్టడం సరికాదు. స్థానికులు అవస్థలు కూడా అర్థం చేసుకొని సత్వరం పనులు పూర్తి చేసేలా పాలకులు దృష్టి సారించాలి.

– విజయ్‌కుమార్, దువ్వాడ

ఏడాది సరిపోలేదా...



మూడున్నర కిలోమీటర్ల రహదారి విస్తరించి బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. రోడ్డుకిరువైపులా రహదారిని విస్తరించారు. ఆరు మాసాల్లో పనులను గత ప్రభుత్వం పూర్తి చేసింది. కూటమి ప్రభుత్వం ఈ విషయంలో పట్టించుకోపోవడం వల్ల నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనచోదకులు, ప్రయాణికులు అసంపూర్తి పనుల వద్ద ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక నాయకులు అయినా పాలకుల దృష్టికి తీసుకువెళ్లి పూర్తి చేసేలా చూడాలి.

– నమ్మి ప్రసాద్, జగ్గరాజుపేట

మే డే స్ఫూర్తితో ఉక్కు పోరాటం ఉధృతం



ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగారావు, పాల్గొన్న నాయకులు

ఉక్కునగరం: మే డే స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేద్దామని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు పిలుపునిచ్చారు. కార్పొరేటర్ గంగారావు, స్టీల్ సీఐటీయూ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కునగరంలో మే డే మార్చ్ నిర్వహించారు. త్రిష్ణా మైదానం నుంచి సెక్టార్ 3, 2,1 మీదుగా సెక్టార్ 5, 6 నుంచి తిరిగి త్రిష్ణా మైదానానికి చేరింది. ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర అనుసరిస్తున్న విధానాలను అందరూ తిప్పికొట్టాలన్నారు. ఉత్పత్తి పెరుగుతున్నా కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదన్నారు.అన్యాయంగా హెచ్‌ఆర్‌ఏ తొలగించారని.. కరెంటు చార్జీలు పెంచారన్నారు. కేంద్రీయ విద్యాలయం, విమల విద్యాలయాలను మూసివేసే దిశగా అడుగులు వేస్తుందని మండిపడ్డారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె. అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్.రావు, బి. అప్పారావు, టి. చిరంజీవి, పుల్లారావు, వల్లి, దుర్గాప్రసాద్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో నేటి నుంచి వేసవి శిబిరాలు

గాజువాక: ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్టు గాజువాక శాఖా గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తెలిపారు. శిబిరం ప్రతిరోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కొనసాగుతుందన్నారు. విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగించుకొనేటట్టు చేయడం, పిల్లల్లో చదివే అలవాటును పెంపొందించడం, ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులను గ్రంథాలయాలకు వచ్చే విధంగా అలవాటు చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఆసక్తిగల చిన్నారులు అవకాశాన్ని వినియోగించుకొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. అలాగే చిత్రలేఖనం, వ్యాసరచనతో పాటు పలు పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. శిబిరం ముగింపు రోజు విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఉగ్రదాడిపై కొవ్వొత్తులతో నిరసనలు



కొవ్వొత్తులు వెలిగించి అమరులకు నివాళులర్పిస్తున్న శివలోహితా డ్రీమ్ వ్యాలీ సొసైటీ నివాసితులు

ఉక్కునగరం: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ ప్రజలు గళం విప్పుతున్నారు. పెదగొల్లలపాలెంకు చెందిన శివ లోహితా డ్రీమ్ వ్యాలీ సొసైటీ నివాసితులు ఆదివారం కమ్యూనిటీలోని పార్క్ నుంచి ప్రధాన ద్వారం వరకు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బాక్సర్ శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, భానుదేవ్, జగదీశ్, సతీష్, రాంప్రసాద్, తిరుమల రావు, వీరయ్య చౌదరి, శాంతి మూర్తి, సత్తిరాజు పాల్గొన్నారు.

- టౌన్‌షిప్ సెక్టార్-12 నివాసితులు ఆదివారం సాయంత్రం ఉక్కు సెక్టార్లలో కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు.ఉగ్రవాదాన్ని అణచివేయడానికి అన్నిదేశాలు ఏకతాటిపైకి రావాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు జి. చంద్రమౌళి, వై.ఎం. రావు, కుమారస్వామి, కె. తాతారావు, చెన్న కిషోర్, రాధిక, చక్రవర్తి, అప్పారావు, భాస్కరరావు, కోటయ్య, రాథోడ్, చంద్రకళ, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు సెక్టార్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

200 మందికి ఉచిత వైద్య సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అగనంపూడి: అగనంపూడి వాకర్స్‌క్లబ్ చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలు అభినందనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కె.ద్వారకానాథ్, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. అగనంపూడి వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వీ హెల్త్‌కేర్ సహకారంతో అగనంపూడి వాకింగ్ ట్రాక్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వాకర్స్‌క్లబ్ ఏర్పాటు చేసిన తక్కువ కాలంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు వాకర్స్ సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. దాతల సహకారంతో వాకింగ్ ట్రాక్‌లో వివిధ సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్న కమిటీని అభినందించారు. ట్రాక్ ఆవరణలో వసతులు కల్పించేందుకు రూ.10 వేలు నగదు అందించిన కర్రి దేవేంద్రను ఘనంగా సత్కరించారు. వైద్య శిబిరంలో 200 మందికి సేవలందించారు. కార్యక్రమంలో వీ హెల్త్‌కేర్ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, శివకుమార్, స్వర్ణలత, వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు మడగల నరసింగరావు, బి.రామారావు, గుదే సుశీలా గజేంద్రరావు, గళ్ల రాజు, కరణం పైడిరాజు, చిన్ని పూర్ణ, బలిరెడ్డి సత్యనారాయణ, డొక్కా రమేష్, చేబోలు శంకరరావు పాల్గొన్నారు.

కేకే రాజును కలిసిన చినతల్లి



కేకే రాజును సత్కరిస్తున్న పల్లా చినతల్లి

గాజువాక: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కేకే రాజును ఆ పార్టీ గాజువాక మహిళా అధ్యక్షురాలు పల్లా చినతల్లి, సీనియర్ నాయకుడు పల్లా పెంటారావు ఆదివారం కలిసి అభినందించారు. ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. పార్టీ అభివృద్ధి కోసం చేపట్టే అన్ని కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వైభవంగా పరదేశమ్మ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు

ఉక్కునగరం: పాత కణితి ప్రాంత గ్రామదేవత పరదేశమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొత్త అమావాస్య నెల పండగ సందర్భంగా కణితి గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పరదేశమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. 87వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డ గోవింద, నాయకులు పిన్నింటి సంతోష్, బండి శ్రీను, దుగ్గపు సూరిబాబు, అప్పిన సన్యాసిరావు, శంకర్, వెంకటరావు అమ్మవారికి పూజలు చేశారు.

అన్న ప్రసాదాలకు విరాళం అందజేత



తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిత్యం తిరుమలేశునికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం శ్రీవారికి విశేష పుష్పాలతో సహస్ర నామార్చన అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా డాల్ఫిన్ హిల్స్‌కు చెందిన వివేకానందన్ మనోహర్, నరేంద్రలు వచ్చే నెల 3న జరిగే అన్న ప్రసాదాలకు రూ.10 వేల విరాళాన్ని దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.